పేదలకు పట్టాలు.. తీరిన కష్టాలు

- 35.5 ఎకరాల లంక భూములకు పట్టాల పంపిణీ
- రెవెన్యూ రికార్డుల్లో 119 మంది లబ్ధిదారుల పేర్ల నమోదు
- సీఎం జగన్‌కు రుణపడి ఉంటామంటున్న లబ్ధిదారులు



లబ్ధిదారులకు పట్టా పంపిణీ చేసిన మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ

అల్లవరం: నదీ పరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న అల్పాదాయ వర్గాలవారికి ప్రభుత్వం లంక భూములపై హక్కు కల్పించింది. ఇప్పటివరకూ ఏక్ సాల్ లీజుగా ఉన్న సీ కేటగిరీ లంక భూములకు ఐదేళ్ల పాటు హక్కు కల్పించి, రైతులకు అందిస్తున్న అన్ని రకాల సంక్షేమ పథకాలు వీరికి వర్తించేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. అంతేకాదు 1–బీ, అండగల్ రికార్డుల్లో నమోదుచేసి లీజుదారులకు యాజమాని హోదా కల్పించారు.

అల్లవరం మండలంలోని బోడసకుర్రు పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్లు 337, 87, 88, 91లో 35.5 ఎకరాల లంక భూమి ఉంది. భారీ వరదల కారణంగా బోడసకుర్రు నదిలో పెరుగుడు భూములైన వీటిని పూర్వం 69 మందికి ఏక్‌సాల్ లీజుపై పట్టాలు ఇచ్చారు. అలా లీజుపొందినవారిలో కొందరు చనిపోయారు. పైగా ఏడేళ్లుగా ఏక్‌సాల్ లీజు పునరుద్ధరణ నిలిపోయింది. దీంతో రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేసి 119 మంది అర్హులను గుర్తించారు. బోడసకుర్రు పంచాయతీ పరిధిలోని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన 119 మంది లబ్ధిదారులకు ఐదేళ్ల పాటు హక్కు కల్పిసూ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ అనురాధ చేతుల మీదుగా ఇటీవలే పట్టాలను పంపిణీ చేశారు. పట్టాలు పొందిన లబ్ధిదారుల పేర్లను రెవెన్యూ రికార్డులు 1బీ, అండగల్‌లో నమోదు చేశారు. దీంతో ఇక నుంచి రైతులకు వర్తించే సంక్షేమ పథకాలు రైతు భరోసా, సున్నా వడ్డీ రాయితీ, పంటపై రుణాలు వీరికి వర్తింపచేయడంతో లబ్ధిదారులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

చాలా ఆనందంగా ఉంది



లంక భూమిపై హక్కు కల్పిస్తూ పట్టాలు ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది. ఇప్పటివరకూ కౌలుదారునిగా ఉన్న నాకు యజమాని హోదా కల్పిస్తూ లంక భూమికి పట్టా ఇచ్చారు. సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

– విప్పర్తి అర్జునరావు, బోడసకుర్రు

సంక్షేమ పథకాలూ వర్తిస్తాయి



లంక భూములకు ఐదేళ్ల పాటు హక్కు కల్పిస్తూ రైతులకిచ్చే అన్ని సంక్షేమ పథకాలు వర్తించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం శుభపరిణామం. ఇక నుంచి మాకు రైతు భరోసా కూడా వస్తుంది. మా కుటుంబాలకు అండగా ఉన్న సీఎం జగన్‌కు ధన్యవాదాలు.

– ఉందుర్తి విజయలక్ష్మి, బోడసకుర్రు

రెవెన్యూ రికార్డుల్లో నమోదు



సీ కేటగిరిలో ఉన్న లంక భూములపై ఐదేళ్ల పాటు హక్కు కల్పించి రెవెన్యూ రికార్డులో నమోదు చేశాం. ఇక నుంచి 1బీ, అండగల్ పత్రాలను పట్టాదారులు నేరుగా సచివాలయానికి వెళ్లి తీసుకోవచ్చు. ఐదేళ్ల అనంతరం తిరిగి రెన్యువల్ చేసుకుంటే మరో ఐదేళ్లు పట్టా అమల్లో ఉంటుంది.

– ఎస్.సాంబశివప్రసాద్, తహసీల్దార్, అల్లవరం

అర్హులను గుర్తించి పట్టాలిచ్చాం



నదీ పరివాహక ప్రాంతంలోని 35.5 ఎకరాల భూమిని పూర్వం 69 మందికి ఏక్‌సాల్ లీజు పట్టాలు ఇచ్చారు. వారిలో కొంతమంది చనిపోయారు. లంక భూములపై ఐదేళ్ల పాటు హక్కు కల్పిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడంతో 119 మంది అర్హులను గుర్తించి పట్టాలు ఇచ్చాం.

– రొక్కాల విజయలక్ష్మి, సర్పంచ్, బోడసకుర్రు

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

- ఉత్సాహంగా వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలు



కోరంగిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న కాదా గోవిందకుమార్

కాట్రేనికోన: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని జెడ్పీటీసీ సభ్యుడు నేల కిషోర్ అన్నారు. కాట్రేనికోన గ్రామ సచివాలయం-3 పరిధిలోని వేట్లపాలెంలో సర్పంచ్ గంటి వెంకట సుధాకర్ అధ్యక్షతన బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా నరసింహమూర్తి, పాలెపు ధర్మారావు, సంసాని నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ సాబోయిన నాగేశ్వరరావు, వాసంశెట్టి శ్రీనివాసరావు, బొంతు అజయ్, కొప్పాడి బాలకృష్ణ పాల్గొన్నారు.

తాళ్లరేవు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం అందుతుందని, ఆ సంక్షేమ పాలన కొనసాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా జగనే రావాలని మండల పరిషత్ అధ్యక్షుడు కాదా గోవింద కుమార్ అన్నారు. బుధవారం కోరంగి సచివాలయం -2లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని సర్పంచ్ పెయ్యల మంగేష్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి గోవిందకుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మల్లాడి భైరవమూర్తి, ఎంపీటీసీ సభ్యులు పాలెపు పోశియ్య, పోతుల రత్నకుమారి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ మల్లాడి శ్రీను, కొపనాతి నాగరాజు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: కులం, మతం, పార్టీ బేధాల్లేకుండా పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందాలంటే ఆంధ్రప్రదేశ్‌కు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా కావాలని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు అన్నారు. మండలంలోని ఐ.పోలవరం సచివాలయం-1 వద్ద బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం స్థానిక సొసైటీ అధ్యక్షుడు విత్తనాల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు, రెడ్‌క్రాస్ చైర్మన్ ఢిల్లీ నారాయణ, దంగుడుబియ్యం వెంకటరామయ్య, కొర్లపాటి ప్రసాద్, పులపకూర కొండ, రామకృష్ణ, పులపకూర వెంకట్రావు పాల్గొన్నారు.



ఐ.పోలవరంలో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న వెంకటపతిరాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శేషగిరిరావు

అమలాపురం టౌన్: గత ఎన్నికల్లో ఇచ్చిన 99 శాతం హామీలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కాలనీ వద్ద ఏపీకి జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, మున్సిపల్ కమిషనర్ వీవీపీ నాయుడు, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, కౌన్సిలర్లు అమలదాసు గోవిందు పాల్గొన్నారు.

అల్లవరం: కోడూరుపాడు సచివాలయం వద్ద ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అధ్యక్షతన ఏపీకి జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శేషగిరిరావు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందన్నారు. తొలుత కోడూరుపాడు సెంటర్‌లో స్వర్గీయ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొనుకు బాపూజీ, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, ఎంపీటీసీలు గుబ్బల రంగనాథస్వామి, రాజేశ్వరి, మాకే కృష్ణమూర్తి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పరమట శ్రీను, ఈతకోట సతీష్, ఉప సర్పంచ్ సుధీర్ పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: పేదలకు అండగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందని జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు అన్నారు. మండలంలోని ఎస్.యానం సచివాలయం వద్ద వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బ్రి బాబ్జి అధ్యక్షతన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక సర్పంచ్ జోగి రాజేశ్వరి ప్రజలకు అందిన సంక్షేమాల పట్టికను ప్రారంభించారు. అనంతరం పార్టీ జెండాను అవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొంకి ఏడుకొండలు, పెట్టా అప్పారావు, ఓగూరి విజయ్‌కుమార్, జోగి రాజా, సూరిబాబు పాల్గొన్నారు.



కాట్రేనికోనలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు



ఎస్.యానంలో సంక్షేమ పథకాల లబ్ధి బోర్డును ఆవిష్కరిస్తున్న సర్పంచ్ రాజేశ్వరి

ఇంటి ముంగిటకే ప్రభుత్వ పథకాలు



ఇందుపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న శ్రీకాంత్

అమలాపురం రూరల్: లబ్ధిదారుల ఇంటి ముంగిటకే ప్రభుత్వ పథకాలు అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మంత్రి విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్ అన్నారు. మండలంలోని ఇందుపల్లిలో బుధవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. అంబేడ్కర్ నగర్‌లో ఒక వృద్ధుడు మంచాన పడి ఉండడంతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఇస్తున్న పింఛన్ కాకుండా అదనంగా ప్రభుత్వ సాయం ఇప్పించాలంటూ వృద్ధుడితో పాటు అతడి కుటుంబ సభ్యులు కోరారు. శ్రీకాంత్ స్పందించి డీఎంఅండ్‌హెచ్‌వో దృష్టికి తీసుకెళ్లి ధ్రువీకరణ పత్రం మంజూరు చేయించాలని కోరారు. ఇంటి రుణాల కోసం కొందరు మహిళలు శ్రీకాంత్‌కు విన్నవించుకోవడంతో ఆయన స్పందించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి వెంకటేశ్వరబాబు, రూరల్ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, కుడుపూడి నాగరాజు, నాగాబత్తుల కొండ, గుత్తుల సత్తిబాబు, కుడుపూడి ప్రసాద్, ఎంపీడీవో వెంకటేశ్వరావు, తహసీల్దార్ శ్రీపల్లవి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన సర్పంచ్

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లి పంచాయతీ పరిధి సింగరాయిపాలెంలోని ఎంపీపీ పాఠశాలను సర్పంచ్ రాజుకుమార్ బుధవారం తనిఖీ చేశారు. పాఠశాలలో జగనన్న గోరుముద్దలో విద్యార్థులకు అందిస్తున్న రాగి జావను పరిశీలించారు. పిల్లలకు పరిశుభ్రమైన ప్రదేశాల్లో ఆహారాన్ని అందించాలని హెచ్‌ఎం జీవీ కృష్ణారావుకు సూచించారు.



భీమనపల్లిలో పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న సర్పంచ్ రాజ్‌కుమార్

బోడసకుర్రులో చెక్‌పోస్టు ప్రారంభం

అల్లవరం: అమలాపురం వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ పరిధిలోని చెక్ పోస్టుని బోడసకుర్రు జాతీయ రహదారి ఆనుకుని బుధవారం ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి ప్రారంభించారు. అనంతరం డోలామణి దంపతులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బడుగు మేరీకుమారి, డైరెక్టర్లు ఈతకోట సతీష్, చప్పిడి దుర్గారావు, నిమ్మకాయల శేఖర్, దూనబోయిన శ్రీరంగ, రంకిరెడ్డి సాంబశివరావు, దంగేటి రుద్ర, కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.



చెక్‌పోస్టు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ డోలామణి

మెరిట్ జాబితా విడుదల

యానాం: యూడీసీలకు అసిస్టెంట్‌లుగా పదోన్నతిని చ్చేందుకు ఆగస్టు 6వ తేదీన నిర్వహించిన పరీక్షకు సంబంధించి మెరిట్ జాబితాను పుదుచ్చేరి డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్ శాఖ అధికారులు బుధవారం విడుదల చేశారు. యానాం నుంచి సూరంపూడి రాజేంద్ర, షేక్‌షాబ్‌జీ ఓలియా, మేడా శ్రీనివాస్, పెదపాటి వినోద్‌కుమార్, మెల్లం గౌతమ్‌రాజ్, కమిడి సిద్ధార్థకుమార్ ఎంపికయ్యారు.

ఇంజినీర్ రమేష్‌కు నివాళి

అమలాపురం రూరల్: ముమ్మిడివరం పీఆర్ సబ్ డివిజన్ డీఈఈ రమేష్ మృతికి సంతాపం తెలియజేస్తూ స్థానిక అమలాపురంలో పీఆర్ కార్యాలయంలో ఈఈ చంటిబాబు అధ్యక్షతన సంతాప సభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఈఈ రాజ్‌కుమార్, డీఈఈ అన్యం రాంబాబు, ఎంఈవో శ్రీనివాస్, లక్ష్మణరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నూతన విగ్రహాల ప్రతిష్ఠ

అమలాపురం రూరల్: మండలంలోని ఈదరపల్లి గ్రామ పరిధి బొంతువారిపేటలో నిర్మించిన కోదండరామాలయంలో బుధవారం స్వామివార్ల నూతన విగ్రహాలను ప్రతిష్ఠించారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, మంత్రి కుమారుడు డాక్టర్ శ్రీకాంత్, బీవీసీ కళాశాల అధినేత బోనం కనకయ్యలు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన అన్నసమారాధనలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, ఎంపీటీసీ కుడుపూడి భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, కుడుపూడి బాబు, కడిమి బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.



స్వామిని దర్శించుకున్న మంత్రి విశ్వరూప్ తదితరులు

ఆడ శిశువు సంబంధీకులు సంప్రదించాలి

కాకినాడ సిటీ: పొదల్లో విడిచిపెట్టిన ఆడశిశువు తల్లిదండ్రులు తమను సంప్రదించాలని, లేకపోతే చట్టబద్ధంగా దత్తత ఇస్తామని కాకినాడ జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారిత అధికారిణి కె.ప్రవీణ తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల మూడున డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం ఎస్ కొత్తపల్లి గ్రామం గచ్చకాయలపొరకి వెళ్లే రోడ్డు పక్కన పొదల్లో ఆడశిశువును ఎవరో విడిచి వెళ్లిపోయారు. స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారం ఇవ్వగా, ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అమలాపురం ఏరియా ఆస్పత్రిలో పది రోజుల చికిత్స అనంతరం పాపను రాజమహేంద్రవరం చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆదేశానుసారం కాకినాడ జిల్లా మహిళా, శిశు సంక్షేమ నిర్వహణలోని శిశు గృహకు ఈ నెల 14న అప్పగించారు. ఈ పాపకు సంబంధించిన తల్లిదండ్రులు, రక్త సంబంధీకులు 30 రోజుల్లో తగిన ఆధారాలతో తమను సంప్రదించాలని ప్రవీణ తెలిపారు. ఎవరూ రాకపోతే పాపను చట్టబద్ధంగా దత్తత ఇస్తామని స్పష్టం చేశారు.

రైతులు అధిక దిగుబడులు సాధించాలి



జి.వేమవరంలో పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్న రైతులు

తాళ్లరేవు: వ్యవసాయ శాఖ అందిస్తున్నసూచనలు పాటించి రైతులు సాగులో అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి ప్రశాంతి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని జి.వేమవరంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్యవంత పైరును పెంచడం, మిత్ర పురుగులను సంరక్షించుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకురాలు హస్సీనా, సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు, గండి రామాంజనేయులు, యర్రంనీడి అప్పారావు, పితాని సుబ్రహ్మణ్యం, యర్రంనీడి అప్పారావు, పితాని సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉచిత ప్రసాద తయారీ కేంద్రం ప్రారంభం



ఉచిత ప్రసాద తయారీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సోదరులు యెండూరి వెంకట్రామయ్య, నాగేశ్వరరావు, వెంకటాచలం, సత్యనారాయణలు రూ.18 లక్షలతో నిర్మించిన ఉచిత ప్రసాద తయారీ భవనాన్ని మంత్రి విశ్వరూప్ బుధవారం ఉదయం ప్రారంభించారు. పలు వితరణ కార్యక్రమాల ద్వారా సేవ చేస్తున్న యెండూరి సోదరులను ఆయన అభినందించారు. అనంతరం నలుగురు సోదరులను ఆలయం తరఫున సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట వినీతాదేవి, ఈవో దూనబోయిన సాయిబాబు, వైఎస్సార్ సీపీ పట్టణ యువజన అధ్యక్షుడు దూడల ఫణి, రాష్ట్ర కాపు నాడు వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బిరెడ్డి సురేష్, ఆలయ ధర్మకర్తలు నడింపల్లి వర్మ, యెండూరి రాఘవ, భరణికాన బాబు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తాళ్లరేవు: ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు, మినీ అంగన్‌వాడీ వర్కర్ల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జె.నిభావాణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని పిల్లంక-1 కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్త, ఉప్పంగల పంచాయతీలో అంగన్‌వాడీ సహాయకురాలు, కాజులూరు మండలం పెనుమళ్ల ఎస్సీపేటలో అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులకు డిసెంబర్ 7వ తేదీలోగా దరఖాస్తు చేయాలన్నారు. మరిన్ని వివరాలకు స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

స్థలం ఆక్రమించారంటూ ఫిర్యాదు

అల్లవరం: కొమరగిరిపట్నం పంచాయతీ పరిధిలోని అంబేడ్కర్ నగర్‌లో నివాసముంటున్న పాస్టర్ ఇంజే వెర్రియ్య తన ఇంటి స్థలాన్ని ఆక్రమించుకుని, తన ఇంటిని కూల్చి వేసి రెవెన్యూ రికార్డులను తారుమారు చేశారని గ్రామానికి చెందిన అయితాబత్తుల మరియమ్మ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జేసీ నుపూర్ అజయ్‌కు బుధవారం ఫిర్యాదు చేసింది. భర్త వదిలేయడంతో బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశం వెళ్లి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నానని తెలిపింది. గల్ఫ్ నుంచి తిరిగి వచ్చే సరికి తన స్థలాన్ని ఆక్రమించుకున్నారని ఫిర్యాదులో పేర్కొంది. 30 ఏళ్లుగా తమ స్వాధీనంలో ఉన్న స్థలాన్ని స్థానిక వీఆర్వో సాయంతో రికార్డులను తారుమారు చేశారని మరియమ్మ ఆరోపించింది. పాస్టర్ వెర్రియ్యపై చర్యలు తీసుకుని తన స్థలాన్ని తిరిగి అప్పగించాలని కోరింది.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో శ్రీసాయి



చిన్నారి ధన్వితా శ్రీసాయి

అమలాపురం టౌన్: అల్లవరం మండలం కొమరగిరిపట్నానికి చెందిన సినీ కాస్ట్యూమ్ డిజైనర్ శ్రీను తడాల కుమార్తె ధన్వితా శ్రీసాయి అతి చిన్న వయసులోనే ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సాధించింది. శ్రీసాయి రెండేళ్లు పూర్తయి ఇటీవలే మూడో ఏడాదిలో అడుగుపెట్టింది. అద్భుతమైన జ్ఞాపకశక్తితో అడిగిందే తడవుగా దేశంలోని రాష్ట్రాలు, వాటి రాజధానుల పేర్లతో పాటు 40 శ్లోకాలను అనర్గళంగా వల్లె వేస్తుంది. చిన్నారి జ్ఞాపక శక్తిని పరిశీలించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో సంస్థ స్థానం కల్పించింది. ఇటీవల తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో సైతం శ్రీసాయి స్థానం కైవసం చేసుకుందని తండ్రి శ్రీను తెలిపారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వరి

ఉప్పలగుప్తం: 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ జవ్వాది వెంకటేశ్వరి సూచించారు. మండలంలోని గొల్లవిల్లి గ్రామంలో సీఎస్ఎం కళాశాల విద్యార్థులకు బుధవారం ఆమె ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. అర్హులైనవారికి ఫారం 6 అందజేసి వచ్చే నెల 9వ తేదీలోగా ఓటు నమోదు చేసుకోవాలని వివరించారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ఐ.పోలవరం: మండలంలోని గుత్తినదీవిలో 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనుల నిమిత్తం గురువారం ఉదయం ఎదుర్లంక, మురమళ్ల, కొమరగిరి గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఆక్వా, గృహ వినియోగదారులకు విద్యుత్ నిలుపుదల చేయనున్నట్లు ఈఈ మోకా రవికుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

కన్నుల పండువగా కల్యాణం



భైరవపాలెంలో వీరేశ్వరస్వామి శాంతి కల్యాణ మహోత్సవం

ఐ.పోలవరం: మండలంలోని భైరవపాలెంలో హిందూ ధర్మ ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆలయ అర్చకులు యనమండ్ర సుబ్బారావు, ఉండి దత్తు శర్మ, పురోహితులు నాగాభట్ల రామకృష్ణమూర్తి ఆధ్వర్యంలో మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి శాంతి కల్యాణ మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత స్వామివారిని, అమ్మవారిని స్థానిక కాలభైరవ ఆలయానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. గ్రామపెద్దలు స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ, గ్రామపెద్దలు పెమ్మాడి బాబూరావు, సమ్మిడి వీర్రాజు, పి.రమేష్‌శర్మ ఏర్పాట్లను పరిశీలించారు.

అయ్యప్పస్వామి 108 కలశాల పూజ



కలశాల పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

యానాం: నియోజకవర్గ పరిధిలోని కనకాలపేటలో కాటంశెట్టి వెంకట రామమూర్తి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి 108 కలశాల పూజ, మహాలక్షార్చన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది. బుధవారం ఉదయం జరిగిన గణపతి హోమానికి ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ హాజరయ్యారు. 18 మెట్లలో అధిష్ఠాన దేవతలకు పూజలు చేశారు. మధ్యాహ్నం పేటతుళ్లి గ్రామోత్సవం, రాత్రికి అయ్యప్పస్వాములకు వడి ఏర్పాటు చేశారు. యానాం పరిసర గ్రామాలకు చెందిన వందలాది మంది మాలధారులు హాజరవడంతో ఆ ప్రాంత మంతా స్వామి శరణుఘోష మారుమోగింది.

ఘనంగా నక్షత్ర పూజలు



ప్రత్యేక అలంకరణలో అనంగేశ్వర స్వామి

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లి అనంగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం కార్తిక మాసం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. పురోహితులు వెలవలపల్లి సత్యనారాయణ శర్మ, ఆలయ ఈఓ కె.కార్తిక, వరదా శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో స్వామి వారికి రుద్రాభిషేకం, లక్షపత్రి పూజ, పూర్ణాహుతి జరిపారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి, అన్న సమారాధన ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

తూరంగిలో చండీ హోమం



చండీ హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్ దంపతులు

యానాం: తూరంగిలో కొలువైన తురేంగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం రాత్రి జరిగిన చండీ హోమంలో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, స్నేహ దంపతులు పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చండీ హోమం అనంతరం ఆయుష్ హోమం, రుద్ర హోమం, కాలభైరవ హోమం తదితర పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే అశోక్ దంపతులకు ఆలయ ప్రతినిధులు సాదర స్వాగతం పలికారు.

కొనసాగిన వికసిత్ భారత్ యాత్ర

యానాం: కేంద్ర ప్రభుత్వ పథకాలకు విస్తృత ప్రచారం కల్పించే ఉద్దేశంతో చేపట్టిన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర రెండోరోజు బుధవారం యానాం నియోజకవర్గ పరిధిలో వివిధ గ్రామాల్లో కొనసాగింది. మెట్టకూరు వీకే కాలనీ కమ్యూనిటీ హాలు, కురసాంపేట స్కూల్ గ్రౌండ్, పరంపేట కల్యాణమండపం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.